

ఆలయం నాడు..

తీరరేఖ వెంబడి పెద్దఎత్తున బీచ్ ప్లాంటేషన్: కలెక్టర్



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మే3(ఆంధ్రజ్యోతి): జిల్లా తీరరేఖ వెంబడి గుర్తించిన ఖాళీ భూముల్లో వర్షాలు ప్రారంభమయ్యేలోపు పెద్దఎత్తున బీచ్ ప్లాంటేషన్ చేపట్టేందుకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌నుంచి కాకినాడ రూరల్, యు.కొత్తపల్లి, తొండంగి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో తీరంలో ప్రతిపాదించిన బీచ్ ప్లాంటేషన్ ప్రణాళికలపై చర్చించి ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ తీరానికి తుఫానుల నుంచి రక్షణ కల్పించడంతోపాటు సుందరీకరణ, ఆదాయ కల్పన, టూరిజం ప్రమోషన్ లక్ష్యాలుగా అందుబాటులో ఉన్న ఖాళీ భూముల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పెద్దఎత్తున మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దీనిలో తొలిదశగా కాకినాడ రూరల్ మండలంలో నేమాం, తమ్మవరం, యు.కొత్తపల్లి మండలంలో కొమరగిరి, తొండంగి మండలంలో ఒంటి మామిడి, గొల్లముసలయ్యపేట, వేమవరంవద్ద 70ఎకరాలు తీర భూములను గుర్తించామన్నారు. వీటిలో నాటేందుకు అనువైన వృక్ష జాతులకు చెందిన లక్ష మొక్కల సాప్లింగ్‌లను వర్షాలు ప్రారంభానికి ముందే సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే పనులను మండల తీర్మానాలతో చేపట్టేందుకు ఈనెల 15వతేదీలోపు మంజూరులు చేయాలని డ్వామా అధికారులను ఆదేశించాలన్నారు. సమావేశంలో పాడా పీడీ చైత్రవర్షిణి, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆపదమొక్కుల.. వాడపల్లి!

ఏడు వారాల వెంకన్నగా వినుతి

ఆదివారం ప్రత్యేకం

ఉన్నావా అసలున్నావా.. ఉంటే కళ్లుమూసుకున్నావా.. భక్తతుకారాం సినిమాలో పాట ఇది.. నిన్న మొన్నటి వరకూ చాలామంది అభిప్రాయం కూడా ఇదే.. దేవుడు లేడనేది వాదన.. ఈ అభిప్రాయం తప్పని.. నేనున్నానని నిరూపించాడు.. వాడపల్లి వేంకటేశ్వరుడు. అందుకే ఆయనను నిదర్శనమూర్తిగా కొలుస్తారు. నిజానికి 2009 వరకు ఆ స్వామిని కొలిచేవారే అరుదు.. కల్యాణోత్సవాల సమయంలో తప్ప ఆ స్వామి చెంత సందడే ఉండేది కాదు.. మరి నేడు.. ప్రతి వారం లక్షలాదిగా భక్తులను తన చెంతకు రప్పించుకుని కోరిన కోర్కెలు తీర్చే ఆపదమొక్కుల వాడిగా వినుతికెక్కారు.. అమెరికా.. ఆస్ట్రేలియా.. తదితర దేశాల నుంచి భక్తులు వస్తున్నారంటే ఆ స్వామి దయ కాకపోతే మరేమిటి.. కోరిన కోర్కెలు తీరుస్తాడనే నమ్మకమే వాడపల్లికీ మహర్దశ. - ఆత్రేయపురం





ఆలయం నేడు..

దేవుడున్నాడు.. భక్తజనం కోర్కెలు తీరుస్తున్నాడు.. అందుకే ఒక్కటా రెండా ఏకంగా ప్రతి శనివారం 40 వేల నుంచి 50 వేల మంది భక్తులు ఆ స్వామిని చూసేందుకు ఎక్క డెక్కడి నుంచో వస్తున్నారు. స్వామిని దర్శించుకుని వెళుతున్నారు. ఒకనాడు ఎక్కడ ఉందో తెలియని వాడపల్లి.. వేంకటేశ్వరుడి ఊరుగా తిరుమల అంత ప్రసిద్ధికెక్కింది. గౌతమి నదీ తీరాన పచ్చని పంటపొలాల నడుమ వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తజన గోవిందనామస్మరణతో విరాజిల్లుతుంది. సుమారు 15 ఏళ్ళ కిందట ఏడాదికోమారు స్వామి ఉత్సవాలు చేయాలంటేనే కష్టం.. అటువంటి స్థితి నుంచి నేడు తిరుమల తరహాలో ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. అలనాడు వందల్లో భక్తులుంటే నేడు ఆ సంఖ్య వేలకు చేరింది. ఓ భక్తుడు సొంత విమానంలో వచ్చి స్వామిని దర్శించుకుని రూ.కోటి విరాళం అందించి వెళ్లారంటే స్వామి ఎంత మహిమాన్వితుడో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత స్వామి వార్షికాదాయం రూ.32 కోట్లకు చేరుకుంది.

ఎర్రచందనం కొయ్యతో స్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో స్వయం భూ ఎర్రచందన కొయ్య విగ్రహంతో మూర్తీభవించిన స్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిస్తారు. దేవతామూర్తుల విగ్రహాలను శిలతో తయారు చేస్తే స్వామి మాత్రమే ఎర్రచందనంతో మూర్తీభవించారు.

2009 నుంచి 7 ప్రదక్షిణలు..

2009 మార్చి 23న అప్పటి ఈవో, సిబ్బంది ఏడు వారాల వెంకన్న దర్శనం..ఏడేడు జన్మల పుణ్యఫలంగా స్వామి ఖ్యాతిని ఇనుమడింప జేశారు.. అక్కడి నుంచి స్వామి వెనుతిరిగి చూసుకోలేదు. భక్తుల కోర్కెలు తీర్చే స్వామిగా అంచలంచెలుగా వినుతికెక్కారు. ఏడు శనివారాలు.. స్వామివారి ఆలయంలో ఏడు ప్రదక్షిణలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. తిరుమల తరహాలో పవిత్రోత్సవాలు, అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, గోదాదేవి కల్యాణం కోట్లాది రూపాయలతో నిర్వహిస్తున్నారు. నిత్యం ఆలయంలో ఐశ్వర్యలక్ష్మీ హోమం, నిత్యకల్యాణం, అష్టోత్తర పూజలు చేస్తారు.

స్వామి వెలిశాడిలా..

విష్ణుమూర్తి ఒకప్పుడు నౌకాపురిగా పిలిచే వాడపల్లిలో వెలుస్తానంటూ అభయమిచ్చాడట.. కొంత కాలానికి గోదావరిలో ఒక పెట్టె కొట్టుకువచ్చింది.. ఒక వృద్ధుడికి స్వామి కలలో కనిపించి ఆ చందన పెట్టె గురించి తెలియజేశాడట.. మరునాడు పెట్టె తీసి తెరిస్తే ఎర్రచందనంతో చెక్కిన స్వామి దివ్య మంగళమూర్తి కనిపించిందట. ఇది తెలిసి నారదుడు స్వామికి వేంకటేశ్వరుడు అని నామకరణం చేసి ఆలయాన్ని నిర్మించాడని పురాణ కథనం.

నాడు వడ్డికాసులవాడే..

2009కి ముందు స్వామి వార్షికాదాయం రూ.18 లక్షలు ఉండేది. ప్రతి ఏటా మార్చి నెలలో స్వామి కల్యాణం నిర్వహిస్తారు. ఆదాయం అంతంత మాత్రంగానే ఉండడంతో అప్పటి ఈవో, సిబ్బంది రూ.3 లక్షల వరకూ అప్పు తెచ్చేవారట. అనంతరం శిస్తును వసూళ్ల చేసి స్వామి కల్యాణం అప్పులు తీర్చేవారు. ప్రస్తుతం 6-ఏ నుంచి డిప్యూటీ కమిషనరు స్థాయికి ఈ క్షేత్రం చేరుకుంది. వార్షికాదాయం రూ.18 లక్షల నుంచి నేడు రూ.32 కోట్లకు చేరుకుంది. 2023లో డీసీ హోదా దక్కించుకున్న ఈ క్షేత్రం 2026లో రీజనల్ జాయింట్ కమిషనరు హోదాకు చేరుకోనుంది. ఆలయంలో 310 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా జీతభత్యాల కింద రూ.6.32 కోట్లు చెల్లిస్తున్నారు.

భూములు.. 116 ఎకరాలు



తిరుమల తరహాలో స్వామికి దాతలు బంగారు విరాళాలు అందజేస్తున్నారు. ప్రస్తుతం స్వామివారికి 7.421 కిలోల బంగారం ఉంది. వెండి 183.339 కిలోలు ఉంది. స్వామికి 406 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 116 ఎకరాలు మాత్రమే ఆధీనంలో ఉంది. దీని ద్వారా రూ.35 లక్షల ఆదాయం వస్తుంది. మిగిలిన భూమి అన్యాక్రాంతమైనట్టు తెలిసింది.

నిత్యాన్నదానం

నిత్యాన్న దానం ఉంది. ప్రతి నెలా 1.50 లక్షల మంది భక్తులు స్వామి ప్రసాదం స్వీకరిస్తారు.రూ.40 లక్షలు ఖర్చవుతుంది. అన్నప్రసాదానికి రూ.11.09 కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. రూ.120 కోట్లతో కేంద్రం అందించే ప్రసాద స్కీమ్‌కు ప్రతిపాదనలు చేసి నట్టు ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఆదాయం రూ.39 కోట్లు

ఏడాది	ఆదాయం	ఖర్చులు(కోట్లలో)
2021-22	రూ.9.36	రూ. 8.68
2022-23	రూ.18.82	రూ.18.14
2023-24	రూ.28.88	రూ. 26.53
2024-25	రూ.39.09	రూ. 32.01

ఫిక్సిడ్ డిపాజిట్లు రూ.3.65 కోట్లు

సేవింగ్స్ ఖాతాలో సుమారు రూ.5కోట్లు

కరుణ చూపిన వరుణుడు..



కాకినాడ భానుగుడి సెంటర్‌లో జోరున కురుస్తున్న వర్షం







సామర్లకోటలోని ఏడీబీ రోడ్డులో కురుస్తున్న వర్షం

ఇదేమి కాలం!

ఉదయం కుమ్ముడు.. సాయంత్రం దంచుడు



అబ్బబ్బా ఇది ఏమి వాన : కాకినాడ నగరంలో శనివారం కురుస్తున్న వాన

- వాతావరణంలో పెనుమార్పులు
- ఉదయం ఎండ.. సాయంత్రం వాన
- 4 రోజులుగా విస్తారంగా వర్షాలు
- శనివారం కాకినాడలో అత్యధికం
- సాధారణస్థితికి వర్షపాతం
- ఆశ్చర్యపోతున్న అధికారులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్రమైన ఎండ.. ఉదయం ఏడు నుంచే నడినెత్తిన సూర్యుడి ప్రతాపం.. బయటకు రావాలంటేనే ఎండవేడికి ఉక్కబోత..చెమటలతో తడిచి ముద్దవుతున్న పరిస్థితి.. మరో పక్క అంత ఎండతో ఆపసోపాలు భరిస్తోన్న ప్రజలకు సాయంత్రం అయ్యేసరికి ఒక్క సారిగా వరుడి కరుణతో ఉపశమనం.. చిరుజల్లుల నుంచి కుండపోత వానతో చల్లబడుతోన్న వాతావరణం.. ఒకపక్క ఈదురుగాలులు.. మరోపక్క కూలుతోన్న విద్యుత్ స్తంభాలు.. నేలకొరుగుతున్న చెట్లతో విచిత్ర పరిస్థితులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నెలకొన్నాయి. మండువేసవితో



అల్లాడించే ఏప్రిల్, మేనెలల్లో గడచిన కొన్నిరోజులుగా భారీ వర్షాలు జిల్లాను ఊపేస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే ఉదయం తీవ్రమైన వేడి.. సాయంత్రం అయ్యేసరికి భారీ వర్షాలతో విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో శనివారం అనేక చోట్ల 38 డిగ్రీలకుపైగా ఎండ చుక్కలు చూపించగా..మధ్యాహ్నం దాటేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉన్నట్టుండి కుండపోతగా వాన.. ఈదురుగాలులు.. బీభత్సం సృష్టించాయి. కాకినాడ రూరల్‌లో అయితే ఏకంగా రాష్ట్రంలోనే అత్యధికంగా 4.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ నగరంలో రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లోకి వాన నీరు వచ్చేసింది. అటు కోటనందూరులో 2.7, కిర్లంపూడి 2.1, తుని 2.25, తాళ్లరేవు,శంఖవరం,రౌతులపూడి,గొల్లప్రోలు, పిఠాపురం, పెదపూడి మండలాల్లో 1.7, తూర్పుగోదావరి జిల్లా రంగంపేట 2.75, గోపాలపురంలో 0.25 మి.మీ. వర్షపాతం నమోదైంది.అయితే ప్రధానంగా తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాలతో పోల్చితే కాకినాడ జిల్లాలో గడచిన రెండువారాలుగా వర్షాలు అనేక మండలాల్లో దంచికొడుతున్నాయి. ఏకంగా భారీ ఈదురుగాలులు, కుండపోత వర్షం కురుస్తుండడం విశేషం. ఇటీవల అన్నవరంలో కురిసిన భారీ వర్షానికి ఆలయ మెట్లపై ధారలా వాననీరు ప్రవహించింది. శనివారం సైతం జిల్లాలో అనేక మండలాల్లో వానకుతోడు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ముఖ్యంగా కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అయితే ఏకంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కొన్నిరోజులుగా గాలివానకు పడుతూనే ఉన్నాయి.

లోటు నుంచి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత నెల ఏప్రిల్‌లో కురిసిన వర్షాలు జిల్లాను లోటు నుంచి సాధారణ వర్షపాతం స్థాయికి తీసుకొచ్చాయి. వాస్తవానికి అంతకుముందు మార్చి నెలలో ఉమ్మడి జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. కాకినాడ జిల్లాలో మార్చి నెలలో సాధారణ వర్షపాతం 12.49 సెంటి మీటర్లు కురవాల్సి ఉంటే 0.82 సెం.మీతో లోటులో ఉంది. కోనసీమ జిల్లాలో 12.02 సెం.మీ.కు సున్నా వర్షపాతం నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 15.18 సెం.మీ.కు 0.04 మి.మీ కురిసింది. ఏప్రిల్ నెలలో కాకి నాడ జిల్లాలో 16.4 సెం.మీ. వర్షం కురవాల్సి ఉంటే ఏకంగా 45.81 సెం.మీ వర్షపాతం నమోదైంది. కోన సీమ జిల్లాలో 10.52 సెం.మీ.కు 20.17 సెం.మీ. కురి సింది. తూర్పుగోదావరి జిల్లాలో 16.73 సెం.మీ.కు 47.49 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒకరకంగా ఈనెలలో ఈస్థాయిలో వర్షపాతం నమోదవడం అరుదని వాతావరణ శాఖాధికారులు వివరించారు.



పిఠాపురంలో వానకు తడవకుండా ధాన్యంపై కప్పిన బరకాలు

హైవేపైనే ఇలా..

అది ఒక జాతీయ రహదారి.. కానీ ఓ మారుమూల పల్లెటూరులోని మట్టిరోడ్డులా నీటమునిగింది. వర్షపునీరు.. వాడకం నీరు కలిసిపోయి వరదలా ప్రవహిస్తుండడంతో హైవే అథారిటీ, పంచాయతీ సిబ్బంది ఒకరినొకరు వంతులాడుకుని అలాగే వదిలేశారు. దీంతో ఇంజన్లు పెట్టి స్థానికులే తొలగించుకున్నారు. కాకినాడ జిల్లాలోని కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై శనివారం ఈ పరిస్థితి కనిపించింది.



కత్తిపూడి హైవేపై వర్షపునీరు, మురుగునీరు కలిసిపోయి అధ్వానంగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న దృశ్యం

జిల్లాలో 307 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు

రూ.15.35లక్షల నిధుల విడుదల

తొండంగి, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 307 పాఠశాలల్లో కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.15లక్షల35వేల నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. పీఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడిభోజనం పథకంలో భాగంగా పాఠశాలలకు రూ.5వేల చొప్పున నిధులు విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో ఎస్‌ఎంసీ సభ్యుల సహకారంతో పాఠశాలలో బడితోట పెంచాల్సి ఉంటుంది. దీనిలో పండే కూరగాయలు, ఆకుకూరలు మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించనున్నారు. దీనికి సంబంధించిన ఇప్పటికే ఉన్న బడితోట ఫొటోలను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలి. న్యూట్రీగార్డెన్‌ల ఏర్పాటుతో పాఠశాలలు పచ్చదనంతో కళకళలాడనున్నాయి.



పోటీల్లో భాగంగా ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు



హోరాహోరీగా తలపడుతున్న తూర్పుగోదావరి, విశాఖ మహిళల జట్లు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- రెండోరోజు హోరాహోరీగా రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు
- వర్షం కురిసినా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు
- పోటీలను వీక్షించిన ఎమ్మెల్సీ నాగబాబు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- సెమీఫైనల్స్‌కు చేరిన మహిళా, పురుషుల జట్లు

6



కాకినాడ రూరల్‌లోని ఎన్టీఆర్ బీచ్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను వీక్షిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీలు

రెడ్‌క్రాస్ స్పెషాలిటీ ఆస్పత్రులను ఏర్పాటు చేయండి

- కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు విజ్ఞప్తి



కేంద్ర ఆరోగ్యశాఖమంత్రి నడ్డాతో మాట్లాడుతున్న వైడీ రామారావు

కార్పొరేషన్(కాకినాడ), మే 3(ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధరాష్ట్రాల్లో రెడ్ క్రాస్ భాగస్వామ్యంతో క్యాన్సర్ ఆస్పత్రుల వంటి స్పెషాలిటీ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించాలని రెడ్ క్రాస్ జాతీయ చైర్మన్ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేసినట్లు రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు తెలియజేశారు. ఢిల్లీలోని నిర్మాణ్ భవన్‌లోని ఆరోగ్య మంత్రిత్వశాఖ కార్యాలయంలో జరిగిన రెడ్ క్రాస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రపతి అధ్యక్షులుగా, కేంద్ర ఆరోగ్య శాఖామంత్రి చైర్మన్‌గా ఉన్న జాతీయ రెడ్‌క్రాస్ దేశమంతా వంద బ్లడ్ సెంటర్ల ద్వారా లక్షలాది యూనిట్ల రక్తాన్ని ప్రజలకు అందజేస్తోందని, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ, సహాయక చర్యల ద్వారా ప్రజల్లో గుర్తింపు పొందిందని అన్నారు. కేంద్ర ఆరోగ్య శాఖ చేపడుతున్న పథకాల ద్వారా రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో క్యాన్సర్ ఆస్పత్రివంటి స్పెషాలిటీ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞాపనను అందజేశానని తెలిపారు. రెడ్‌క్రాస్ కాకినాడ జిల్లాశాఖ సేవా కార్యక్రమాలు, కాకినాడలో నిర్మించిన రెడ్ క్రాస్ భవనం, వృద్ధాశ్రమం, దివ్యాంగుల పాఠశాలల గురించి తెలియజేశానని చెప్పారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఓవైపు హోరున కురిసిన వర్షం.. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో కబడ్డీ ఆడేందుకు సిద్ధమైన మహిళా, పురుష క్రీడాకారులు.. బీచ్ కబడ్డీని వీక్షించేందుకు పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు తరలివచ్చారు. వర్షానికి కబడ్డీ పోటీలు జరుగుతాయో లేదోనన్న మీమాంసతో నిర్వాహకులు ఉన్నారు. సాయంత్రం వర్షం తెరిపి ఇవ్వడంతో బీచ్ కబడ్డీ పోటీలు శనివారం యథావిధిగా కొనసాగాయి.

- రెండోరోజు హోరాహోరీగా రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు
- వర్షం కురిసినా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు
- వీక్షించిన ఎమ్మెల్సీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- సెమీఫైనల్స్‌కు చేరిన మహిళా, పురుషుల జట్లు

సర్పవరం జంక్షన్, మే 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఏపీ కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రెండోరోజు శనివారం సాయంత్రం కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో నిర్వహించిన 12వ రాష్ట్ర అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలు మహిళా, పురుషుల జట్లకు వేర్వేరుగా హోరాహోరీగా సాగాయి. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా నువ్వా నేనా అన్న స్థాయిలో రసవత్తరంగా జరిగాయి. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి క్రీడా మైదానమంతా చిత్తడిగా మారినా ఎమ్మెల్యే నానాజీ యుద్ధప్రాతిపదికన కార్పెట్లు ఏర్పాటు చేసి కబడ్డీ పోటీలు జరిగేలా చర్యలు తీసుకున్నారు. రెండోరోజు కబడ్డీ పోటీలను డిప్యూటీ సీఎం పవన్ సోదరుడు, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు వీక్షించారు. అనంతరం ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని రాష్ట్ర క్రీడాస్ఫూర్తిని దేశానికి చాటిచెప్పాలని కోరారు. క్రీడలతో వ్యక్తిగత భవిష్యత్తుతో పాటు రాష్ట్రానికి ఖ్యాతి లభిస్తుందన్నారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ మాట్లాడుతూ



క్రీడాకారులకు సెల్ఫీ ఇస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన జట్లు జాతీయస్థాయికి ఎంపిక ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. క్రీడల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ క్రీడలను వ్యయప్రయాసల కోర్చి చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీని అభినందించారు. నానాజీ ఆధ్వర్యంలో ఈనెల 21, 22వ తేదీల్లో ఫ్యాన్ పార్క్ ఐపీఎల్ క్రీడలు జిల్లా క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్టు సతీష్ తెలిపారు. బీచ్ సందర్శనకు వచ్చే వారికిఅన్నిరకాల సౌకర్యాలు కల్పించేందుకు కు డా నుంచి రూ.3కోట్లు మంజూరు చేశామని కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి తెలిపారు. కబడ్డీ పోటీలను వీక్షించిన వారిలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, దాట్ల బుచ్చిబాబు, గిడ్ల సత్యనారాయణ ఉన్నారు. వర్షం కారణంగా సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావాల్సిన కబడ్డీ పోటీలు 6 గంటలకు ప్రారంభమయ్యాయి. తిలకించేందుకు పెద్ద ఎత్తున సందర్శకులు వచ్చారు.

విజేతల వివరాలివి..

కాగా రెండోరోజు పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మహిళల విభాగంలో విజయనగరం, చిత్తూరు, కృష్ణా, అనంతపురం జిల్లాల సెమీ ఫైనల్స్‌కు చేరాయి.



బెలూన్లను వదిలి రెండోరోజు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు



కబడ్డీ ఆడుతున్న మహిళ, పురుషుల జట్లు

రేపు ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నిర్వహణ

పిఠాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక ఈ నెల 5వ తేదీన అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కంతేటి పేర్రాజు పంతులు ఉన్నత పాఠశాలలో ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు చిత్తూరులో ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ జరిగే ఆంధ్ర రాష్ట్ర సబ్ జూనియర్స్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. 2012 జనవరి 1 తర్వాత పుట్టిన వారే ఇందులో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంపికలో పాల్గొనే వారు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

రూ.54.94 లక్షల ఆదాయం


ఆలయంలో స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఆత్రేయపురం, మే 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆల యానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకుమజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మిహోమం, భాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వా మివారిని దర్శించుకుని తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించా రు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వా మి వారికి ఒక్కరోజు రూ.54.94 లక్షల ఆదాయం లభించినట్టు ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.


వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి

వెండి కిరీటం బహూకరణ

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారికి తాడేపల్లిగూడెనికి చెందిన జి.జగదీష్ దంపతులు 250గ్రాములతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ఈవో చక్రధర రావు దాతలకు స్వామి చిత్రపటం అందజేశారు.


వెండికిరీటం బహూకరిస్తున్న దాతలు

సివిల్స్‌లో ప్రతిభకే పట్టం

మొదటి ప్రయత్నంలో ఇంటర్వ్యూ వరకు

మూడో ప్రయత్నంలో విజయం

సన్మాన కార్యక్రమంలో 247వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్



వినయ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

చాగల్లు, మే 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జరిగే సివిల్స్ పరీక్షల్లో ప్రతిభకే పట్టం కడతారని డబ్బు, పలుకుబడికి ఎటువంటి అవకాశం ఉండదని దొమ్మేటి వినయ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెనికి చెందిన వినయ్ సివిల్స్ పరీక్షల్లో 247వ ర్యాంకు సాధించిన సందర్భంగా ఘనంగా సన్మానించారు. విజయ్ మాట్లాడుతూ "అత్యంత క్లిష్టమైన సివిల్స్ పరీక్షల్లో లక్ష్యసాధన కోసం నిరుత్సాహపడకుండా నిరంతర సాధన చేయాలి. ఎప్పుడు విజయం సాధిస్తామో గ్యారంటీ లే కపోయినా పూర్తి నమ్మకంతో ఉండాలి. తిరుమలలో ఇంటర్ చేసి జేఈఈ పరీక్ష రాసి ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లో చేరాను. రెండో సంవత్సరంలో సివిల్స్ పరీక్ష రాయాలని నిర్ణయించుకున్నా. విధాన పరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం సివిల్స్ సర్వీసెస్‌లోనే ఉంది. దేశానికి, ప్రజలకు సేవ చేసే అవకాశం ఆలిండియా సర్వీసుల్లోనే ఉంది. సివిల్స్‌లో మూడు దశలు ఉంటాయి. ఏ దశలో ఆగిపోయినా మళ్లీ మొదటి నుంచి రాయాలి. మొదటి సారి ర్యాంకు సాధించి ఇంటర్వ్యూకి వెళ్లా కానీ అక్కడ సెలెక్ట్ కాలేదు. మూడోసారి రాసినప్పుడు 247వ ర్యాంకు సాధించాను. 24వ ఏటనే నాకు ఈ అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇంట్లో ఒత్తిడి లేనప్పుడే చదువులో వారికి వారే నిర్ణయాలు తీసుకుంటారు. పిల్లలు మానసిక ఒత్తిడికి గురైతే తల్లిదండ్రులు గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలి. ఇంటర్వ్యూలో ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతి గురించి అడిగారు. నా అభిప్రాయాలను కచ్చితంగా చెప్పాను. నా విజయం పట్ల గ్రామస్థులు సంతోషంగా ఆహ్వానించి సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గారపాటి బాబురావు, ఆత్కూరి దొరయ్య, టీడీపీ నాయకులు గారపాటి శ్రీనివాసరావు, పత్తిపాటి వెంకటేశ్వరరావు, గారపాటి కాశివిశ్వనాధం, దొమ్మేటి మేణు, కరుటూరి రామారావు, గారపాటి కృష్ణ, సీహెచ్ రాధాకృష్ణ పాల్గొన్నారు. ప్రస్తుతం కొవ్వూరులో ఉంటున్న విజయ్ తండ్రి జగదీశ్వర రావు విద్యుత్ ఏఈ కాగా తల్లి కనకదుర్గ గృహిణి. కుమారుడి విజయంలో కీలకపాత్ర పోషించిన తల్లిదండ్రులను సభికులు కొనియాడారు.

హత్య చేసి.. హైవే పక్కన పడేసి..


గొల్లప్రోలులో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

- భర్త హత్య కేసులో భార్య సహా ముగ్గురి అరెస్టు
- వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ

గొల్లప్రోలు, మే 3(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య తన ప్రియుడు, స్నేహితుడితో కలిసి భర్తను హత్య చేసి మృతదేహాన్ని జిల్లా దాటించి 75 కిలోమీటర్ల దూరంలో పడవేశారు. తమ గుట్టు బయటపడలేదని భావించారు. కానీ, మృతుడి తల్లి ఫిర్యాదు, సాంకేతికత అంశాల ఆధారంగా పోలీసుల దర్యాప్తుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి భార్యతో సహా ముగ్గురిని అరెస్టు చేసినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్‌లో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను ఎస్పీ వెల్లడించారు.

మృతదేహం గుర్తింపుతో దర్యాప్తు

కాకినాడ జిల్లా పరిధిలోని కత్తిపూడి-కాకినాడ మధ్యగల 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులో మార్చి 3న గుర్తు తెలియని వ్యక్తి 35-40ఏళ్ల మృతదేహం గాయాలతో కుళ్లిన స్థితిలో ఉండగా పోలీసులు గుర్తించారు. చేబ్రోలు వీఆర్వో ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి ఎస్పీ, ఏఎస్పీ ఆధ్వర్యంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలు, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. రాష్ట్రంతోపాటు సరిహద్దు రాష్ట్రాల మిస్సింగ్ కేసులు, జాతీయ రహదారిపై సీసీ కెమేరాలు, టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజీలు, సెల్‌టవర్ ఆధారంగా విచారణ సాగించారు. దర్యాప్తు సాగుతున్న సమయంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏప్రిల్ 28న తన కుమారుడు రెండునెలలుగా కనిపించడంలేదని తల్లి చేసిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదైంది. దీనిపై పరిశీలన జరపగా మృతదేహం యలమంచిలి పట్టణం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ల లోవరాజుగా గుర్తించారు. లోవరాజు భార్య శ్యామలకు భర్త బంధువైన మాడెం మోహన్‌కుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. దీన్ని కొనసాగించడానికి భర్త అడ్డంకిగా ఉన్నాడని వారిద్దరూ భావించారు. దీంతో మోహనకుమార్, అతడి స్నేహితుడు బల్లా గంగాధరరావు కలిసి ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి లోవరాజును హత్య చేసి చేబ్రోలు హైవే పక్కన పడవేశారు. 75 కిలోమీటర్ల దూరంలో జిల్లాను దాటి మృతదేహాన్ని ఇక్కడ పడవేయడం, రెండు నెలల వ్యవధిలో తమపై ఎవరికీ అనుమానం రాలేదని నిందితులు భావించారు. కుమారుడు కనిపించకపోవడం, కోడలి ప్రవర్తనపై అనుమానంరావడంతో మృతుడి తల్లి యలమంచిలి పోలీసులను ఆశ్రయించింది. దీని ఆధారంగా దర్యాప్తు జరపడంతో కేసు కొలిక్కి వచ్చినట్టు కాకినాడ జిల్లా ఎస్పీ వివరించారు. భార్య, ఆమె ప్రియుడు, స్నేహితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన మారుతి ఎర్టిగా కారును సీజ్ చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ, ప్రత్యేక దర్యాప్తు బృందం సభ్యులను అభినందించారు.

అనుమానాస్పదంగా యువతి మృతి

బావే చంపేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు


ఫైల్‌ఫొటో

శంఖవరం, మే 3 (ఆంధ్రజ్యోతి): యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం కాకినాడ జిల్లా శంఖవరం మండలం గొంది కొత్తపల్లికి చెందిన మిమిడి లోకేశ్వరి (19) ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తొలుత ఆత్మహత్యగా భావించిన తల్లిదండ్రులు పోలీసు ఫిర్యాదు లేకుండా దహన కార్యక్రమాలు చేసేద్దామనుకున్నారు. అయితే మృతురాలి అక్క భర్తపై అనుమానం రావడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దివ్యాంగురాలైన తన అక్క భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడని గ్రామంలో పుకార్లు రావడంతో శుక్రవారం ఆ మహిళ ఇంటికి వెళ్లి లోకేశ్వరి తన బావ జోలికి రావొద్దని హెచ్చరించింది. ఈ విషయం తెలుసుకున్న బావ లోకేశ్వరిని మందలించాడు. దీంతో ఇద్దరికి వాగ్వాదం జరిగింది. అదేరోజు సాయంత్రం ఇంట్లో ఉరికి వేలాడుతూ కనిపించింది. తన పెద్దల్లుడే తన కూమార్తెను చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నాడని యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలైన తన అక్క కాపురం చెడిపోతుందనే మనస్థాపంతో యువతి ఆత్మహత్య చేసుకుందని అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. శవపంచనామా నివేదిక ఆధారంగా దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.


లోకేశ్వరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

'ఉమ్మడి జిల్లాలో ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), మే 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎంప్లాయిస్ ఆఫ్ ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసోసియేషన్ ఈవో, సూపర్‌వైజర్స్ జిల్లా సమావేశం కాకినాడ ఫుడ్ స్ట్రీట్ శాంతిభవన్‌లో శనివారం నిర్వహించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ పి.ప్రకాష్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డి.శ్రీకాంత్ రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ ఉద్యోగుల సమస్యలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయని వాపోయారు. అంగన్‌వాడీ లెవెల్ నుంచి సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బందికి మొబైల్ యాప్స్‌తో పని భారం చాలా విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. జిల్లా ప్రెసిడెంట్‌గా ఎస్.పద్మశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అరుణ, జిల్లా ట్రెజరర్‌గా కే.నిర్మల కుమారి, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కే.రమణికుమారిలు ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు.



నూతనంగా ఎన్నికైన మహిళా శిశు విభాగం ఉద్యోగుల కాకినాడ జిల్లా కార్యవర్గం

ఓబీఈపై అవగాహన సదస్సు


రిసోర్స్ పర్సన్ డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మే 3(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ(యూసీఈకే)కు త్వరలో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) బృందం రానున్న దృష్ట్యా శనివారం సెనేట్ హాల్లో అధ్యాపకులకు ఎన్‌బీఏ గుర్తింపునకు చేపట్టాల్సిన విధానాలు, అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ)పై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎన్.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు వరంగల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) సీఎస్ఈ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ టి.రమేష్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. రమేష్ మాట్లాడు తూ మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకు సాధించేందుకు అధ్యాపకుల సమష్టి కృషి చాలా అవసరమన్నారు. నిర్దేశిత పాఠ్యప్రణాళిక, బోధన, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, అభ్యసన తదితర వాటి రూపకల్పనపై అవగాహన పెంపొందించుకోవాలని అధ్యాపకులకు సూచించారు. రమేష్‌ను ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, పద్మరాజు, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్,బాలకృష్ణ, దీక్షితులు అధ్యాపకులున్నారు.

వాన...వే!


జగ్గంపేట జాతీయ రహదారిపై మురుగునీరు


శంఖవరం జాతీయ రహదారిపై నీటిని బోర్లతో తోడుతున్న స్థానికులు

శంఖవరం/జగ్గంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి) వర్షం కురిసినప్పుడు రోడ్లపై వర్షం నీరు ఉండిపోవడం సాధారణమే విషయమే. అయితే జాతీయ రహదారిపై కూడా నీరు ఉండిపోతే. వాహనదారులకు ఎన్నో ఇబ్బందులు తప్పవు. కాకినాడ జిల్లా శంఖవరం- కత్తిపూడి హైవే అయితే మారుమూల వీధిలా మారిపోయింది.. వర్షం, వాడకం నీరు కలిసి రాచబాటను ముంచెత్తింది. మురుగుని తొలగించేందుకు హైవే అథారిటీ, పంచాయితీ సిబ్బంది ఒకరినొకరు వంతులాడుకుని పదిరోజులుగా అలాగే వదిలేశారు. స్థానికులు ఇంజన్లు పెట్టి నీటిని బయటకు తొలగిస్తున్నారు. అలాగే జగ్గంపేట నాలుగు రోడ్ల జంక్షన్లో జాతీయ రహదారి అప్రోచ్ రోడ్డులో మురుగునీరు పోయే మర్గాలు లేక కొద్దిపాటి వర్షం వస్తే చాలు మురుగునీటితో రోడ్డు నిండిపోతుంది.

రైల్వే సిబ్బంది అపూర్వ కలయిక

సామర్లకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో సామర్లకోట పరిధి రైల్వే ఎంప్లాయిస్ పాతమిత్రులు (1970-1985) కుమారులు, కుమార్తెలతో కలిసి గెట్ టూ గెదర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. తమకు విద్య నేర్పిన గురువులు ఎస్.గోపాలా చార్యులు, శ్రీరామచంద్రమూర్తి, ఇండిగ సత్యనారాయణను ఆహ్వానించి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆత్మీయ విందు నిర్వహించారు. పాఠశాల తరగతి గదుల్లో జ్ఞాపకలను నెమరువేసుకున్నారు. అనంతరం జ్ఞాపికలు అందజేసుకున్నారు. కార్యక్రమానికి నాయకత్వం వహించినవారిలో సేపేని సురేష్, కాళ్ళ గోవిందరాజులు, కెవీవీ.రావు, సియాదుల ఆదినారాయణ, కర్రి శ్రీను, సత్యనారాయణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో కలిసిన రైల్వే సిబ్బంది కుటుంబ సభ్యులు

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

అత్తాకోడళ్ల చెరువులో మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

పెద్దాపురం, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఉన్న అత్తాకోడళ్ల చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను నియంత్రించాలని కోరుతూ ఆర్డీవో శ్రీరమణికి గ్రామానికి చెందిన మనం మన ఊరు టీమ్ సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారు. ఎక్స్‌కవేటర్లతో భారీగా తవ్వేస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్డీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ప్రజలకు మంచి చేయాలన్నదే పవన్ తపన

● ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురంరూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నిరంతరం మంచిచేయాలన్నదే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్ తపన అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు అన్నారు. కష్టాల్లో ఉన్నవారిని కాపాడుకోవాలని ఎల్లప్పుడు మానవతా దృక్పథంతో ఆలోచిస్తారని తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురం గోకులంగ్రాండ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం సహాయనిధి ద్వారా 22మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.16.38లక్షల చెక్కులను అందజేశారు. అదే విధంగా వైద్యం నిమిత్తం మరొకరికి రూ.8లక్షల ఎల్‌వోసీని అందించారు. జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి సాయం అందజేత

పిఠాపురంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు చల్లా శివకుమార్‌కు ఎన్ఆర్ఐ అనిశెట్టి స్వామి, బృందం రూ.3లక్షలు, కాపు అభ్యుదయ సంఘం నాయకులు లక్ష రూపాయలను అందివ్వగా ఆ మొత్తాలను ఎమ్మెల్సీ నాగబాబు అందజేశారు. పదవ తరగతి పరీక్షల్లో 580మార్కులు సాధించిన రావర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డీఎస్ఎన్‌వీ పూజ, ఎన్‌జేవీ రవితేజలను నాగబాబు అభినందించారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

భారీ వర్షం


భారీ వర్షానికి నీటమునిగిన కాకినాడ సినిమా రోడ్డు, కొండయ్యపాలెం ఫ్లైఓవర్-నాగమల్లితోట జంక్షన్‌కు వెళ్లే దారి ఇలా..

● కాకినాడలో మునిగిన రహదారులు
● పిఠాపురం, సామర్లకోటల్లో తడిసిన ధాన్యం రాశులు


సామర్లకోటలో ధాన్యానికి బరకాలు కప్పుతున్న కూలీలు

కాకినాడ/పిఠాపురం/ గొల్లప్రోలు/సామర్లకోట/కొత్తపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): కాకినాడతోపాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి, సామర్లకోట సహా పలుచోట్ల శనివారం భారీ వర్షం కురిసింది. వాన ధాటికి కాకినాడ నగరంలోని పలు వీధులు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పిఠాపురం పట్టణంలోని ఫైర్ స్టేషన్, రథాలపేట అంబేడ్కర్ సెంటర్, పాతబస్టాండు, సినిమాసెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లో డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. గాలులు వీయడంతో పలుచోట్ల బోర్డులు పడిపోయాయి. చెట్లు కొమ్మలు విరిగిపడగా, మామిడికాయలు నేలరాలాయి.

రైతులకు తప్పని కష్టం

శనివారం ఉదయం ఎండ కాయడంతో దాళ్వా వరి మాసూళ్లు నిర్వహించిన రైతులు ధాన్యాన్ని రాశులుగా వేసి వాటిపై బరఖాలు, టార్పాలిన్లు కప్పారు. భారీ వర్షం పడడంతో గొల్లప్రోలు టోల్‌ప్లాజా, పిఠాపురం, గొల్లప్రోలు, చేబ్రోలు బైపాస్‌రోడ్డు, పిఠాపురం-తిమ్మాపురం మధ్యగల 216వ జాతీయ రహదారిపై టార్పాలిన్లు కప్పిన ధాన్యం రాశుల్లోకి నీరు చేరింది. సామర్లకోట మండలంలోని భీమేశ్వరాలయం రోడ్డు, వ్యవసాయ క్షేత్రానికి వెళ్లే రోడ్డు, మాండవ్యనారాయణ స్వామి ఆలయం ఎదురుగా అధికశాతం రైతులు ఆరబోసిన ధాన్యం రాశులపై అకస్మికంగా కురిసిన వర్షానికి ధాన్యం రాశులు తడిచాయి.


పిఠాపురంలో రోడ్లపై ప్రవహిస్తున్న వర్షపు నీరు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శృంగార వల్లభస్వామి

శృంగార వల్లభస్వామికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 15వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేషపూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,19,442 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

6 నుంచి భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు

సర్పవరం జంక్షన్, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాలు ఈనెల 6 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం సర్పవరంలో భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వార్షిక కల్యాణంలో భాగంగా ఈనెల 6న మూలమూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి పెండ్లి కుమారుడిని చేయడం, 7న నిత్యపూజ, బలిహరణం, తిరువీధి ఉత్సవం, 8న ఎదురు సన్నాహం, 9న కల్యాణ దంపతుల భావనారాయణస్వామి గ్రామోత్సవం, 10న నిత్యహోమం, 11న బలహరణ నిర్వహిస్తామన్నారు. 11న నిత్యపూజ హోమం, తిరువీధి ఉత్సవం, 12న మహాపూర్ణాహుతి అనంతరం సముద్రంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తామన్నారు. 13న ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం, హారతి అనంతరం ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణలు, 108 దంపతులకు దంపతుల తాంబూలం, 14న స్వామివారికి నిత్యపూజ అనంతరం సాయంత్రం 7గంటలకు ముక్తికా సరస్సులో వైభవంగా తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అమరావతి పునః ప్రారంభోత్సవం'

కాకినాడసిటీ, మే 3, (ఆంధ్రజ్యోతి): అమరావతి పునః ప్రారంభోత్సవానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా విజయవంతమైందని కాకినాడ జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ ఉండవల్లి వీర్రాజుచౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపౌరుడు సగర్వంగానా రాజధాని అమరావతి అని చెప్పుకొనేలా నిర్మాణం చేడతామని సీఎం చంద్రబాబు చెప్పడం అభినందనీయమన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధితో పాటు, పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తయ్యేలా తాను సహకరిస్తానని మోదీ హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు.

9న పిఠాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు


ఎన్నికల వివరాలను వెల్లడిస్తున్న న్యాయవాదులు

పిఠాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): పిఠాపుర బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి బత్తిన లక్ష్మణదొర తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. అసోసియేషన్ కార్యవర్గంలోని పదవులకు ఈనెల 5వ తేదీన నామినేషన్ల స్వీకరణ, 6న పరిశీలన, 7న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారని చెప్పారు. 9వ తేదీన ఉదయం 9.30గంటలు నుంచి సాయంత్రం 4.30గంటల వరకూ బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో తనతోపాటు న్యాయవాదులు రమణారావు, కొత్త సురేష్ సహకరిస్తారని తెలిపారు.

పెద్దాపురం బార్ అసోసియేషన్...

పెద్దాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది 2025-26కి సంబంధించి బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల ఎనిమిది తేదీ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారుల సారా మురళీ శ్రీనివాస్, వందే విజయరాజ్ కుమార్, డాక్టర్ కె.ఎస్.నాయుడు తెలిపారు. అధ్యక్ష పదవికి వేదుల సుబ్రహ్మణ్యం (మణి), తటవర్తి సత్యనారాయణలు శనివారం నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

'హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలి'

కాకినాడరూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో పనిచేస్తున్న వ్యవసాయవిస్తరణాధికారులను హేతుబద్ధీకరణ నుంచి మినహాయించాలనికోరుతూ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యవసాయవిస్తరణాధికారుల సంఘం ఆధ్వర్యంలో జేడీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సతీష్ మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల హేతుబద్ధీకరణలో కొన్నిచోట్ల తమను కూడా గ్రామస్థాయిలోని రైతుసేవా కేంద్రంలో తమకు విధులు కేటాయించడాన్ని నిరసిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో తమను సహాయకులుగా నియమించాలని జేడీని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘ సభ్యులు గౌడ్, స్వామి, మూర్తి,శాంతి, కమల, కృష్ణవేణి ఉన్నారు.

దోమాడ బాధితులను ఆదుకోవాలి

కలెక్టరేట్ (కాకినాడ), మే3 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం దోమాడగ్రామంలో ఇల్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని ఆంధ్రమాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధాంతాల కొండబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాధితులతో కలిసి కాకినాడ కలెక్టరేట్‌కు విచ్చేశారు. కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడామని ఆయన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 5న తలపెట్టిన చలో దోమాడ కార్యక్రమం వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో ఉల్లం రవి, రవి కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం పరామర్శించారు. పరామర్శించినవారిలో మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి) మొయిళ్ళ కృష్ణమూర్తి కేదారి నల్లబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

సామర్లకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో మాజేటి నగర్‌లో ఉన్న బీజేపీ నాయకుడు మాజేటి కృష్ణను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం పరామర్శించారు. ఇటీవల కృష్ణ భార్య అనారోగ్యంతో మరణించిన విషయం విదితమే. ఆమె మృతికి ఎమ్మెల్యే సానుభూతిని వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే చినరాజప్పకు లేఖర్ల వినతి

సామర్లకోట, మే 3(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రిజిస్ట్రేషన్ కార్యాలయం పాత తహశీల్దార్ కార్యాలయంలోకి మారుస్తున్నందున సుదీర్ఘకాలంగా ఈ కార్యాలయం వద్ద డాక్యుమెంట్లు రాసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు తాత్కాలికంగా షాపులను కేటాయించాలని కోరుతూ డాక్యుమెంట్ లేఖర్లు శనివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. పాత తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం కూడా మార్పుచేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్‌అండ్‌బీ అధికారులకు ప్రతిపాదనలు జారీ అయ్యాయి. దీంతో మరో నెల రోజులలో అద్దె భవనంలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయం మారనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్పను కలిసిన వారిలో పేకేటి రమేష్, పుత్రయ్య, వెంకట్, సీతాపతిరావు, లాల్, అప్పారావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, మే 3(ఆంధ్రజ్యోతి): సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ ఫీడర్ల వార్షిక మరమ్మతుల దృష్ట్యా వారంరోజులపాటు పనులు చేయనున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెద్దాపురం విద్యుత్ ఈఈ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ తెలిపారు. ఈ కారణంగా రిలయన్స్, పామ్‌టెక్, సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నందున విద్యుత్ వినియోగదారులు అధికారులకు సహకరించాలని ఈఈ ప్రభాకర్ కోరారు.

ఉపాధి పథకంలో 200 రోజులు పనికల్పించాలి

● రోజు కూలీ రూ.600 చెల్లించాలి



కొత్తపల్లిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి, మే3(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అమలుచేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికి 200 రోజుల పనిని కల్పించాలని ఏపీ ఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మికుల పోరాటదినం సందర్భంగా 139వ మేడే వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి ఊరచెరువు గట్టుపై శనివారం ఏపీ ఆర్‌సీఎస్ జెండాను ఆయన ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ఉపాధిలేక వేరేప్రాంతానికి వలసలు పోవడం వలన గ్రామాలు వెలవెలబోతున్నాయన్నారు. ఉపాధి పథకంలో పనిచేసే కార్మికులకు సంవత్సరానికి 200రోజులు ఉపాధి కల్పించి, రోజుకి రూ.600ల వేతనం చెల్లించే విధంగాప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. తొలుత కొత్తపల్లిలో ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఏఐఎఫ్‌టీ యూ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, జిల్లా నాయకులు డి.నారాయణ మూర్తి, పారిశుధ్య కార్మికసంఘాల సమాఖ్య కన్వీనర్ బొచ్చ యేసు, ప్రగతిశీల మహిళా సంఘ(స్త్రీవిముక్తి) నాయకురాలు డి.సంగీత, రెడ్డిదుర్గాదేవి, ఏపీ ఆర్‌సీఎస్ నాయకులు సోమరాజు, గెడ్డం చిట్టి మ్మ, భూషణం, మహాలక్ష్మి, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలి : ఏడీఏ


ప్రకృతి వ్యవసాయం అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఏడీఏ బాబూరావు

కరప, మే3(ఆంధ్రజ్యోతి): భూసార పరిరక్షణకు, ఆరోగ్యకర పంట ఉత్పత్తుల సాధనకు రైతు లు ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని కరప సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు సూ చించారు. కరప మండలం విజయరాయుడుపాలెంలో శనివారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానంలో పెసలు, మినుములు, కందులు, తదితర 31రకాల విత్తనాలను చల్లడంవల్ల భూమి సారవంతమై మేలైన పంట ఉత్పత్తులను సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంట ఉత్పత్తులవల్ల మంచి ఆదాయంతోపాటు ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆదర్శ రైతులు ప్రకృతి వ్యవసాయంలోని తమ అనుభవాలను వివరించారు. వారిని సన్మానించారు. గ్రా మసర్పంచ్ వి.సీతారామరాఘవ, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ ఎస్.ధనలక్ష్మి, ఫణీంద్ర, ఐసీఆర్‌పీలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



మహిళా కార్మికులకు వస్త్రాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్యానందం

కాకినాడసిటీ, మే 3, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు తాళ్లూరి రాజు నేతృత్వంలో స్థానిక వెంకటరత్నపురం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం జాతీయ కాంగ్రెస్ పార్టీ 87 ఏళ్ల క్రితమే కార్యాచరణ రూపొందించి శ్రమజీవుల కుటుంబాలకు అండగా నిలిచిందని తెలిపారు. ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు కార్మి క సంఘాలకు అండగా ఉంటూ నిరంతరం పోరాటాలు సాగిస్తుండడం అభినందనీయమన్నారు. తాళ్లూరి రాజు మాట్లాడుతూ కార్మికులు లేనిదే ప్రపంచమేలేదన్నారు. జిల్లాలోని ఐఎన్‌టీయూసీకి మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు ఎంఎం పల్లంరాజు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎన్‌టీయూసీ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా మహిళా కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ ప్రతినిధులు, ఇతర సంస్థల కార్మిక ప్రతినిధులు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎం సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

జానకిరామచౌదరికి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం


ఎన్టీఆర్ పురస్కారం అందుకుంటున్న జానకిరామ చౌదరి

కార్పొరేషన్(కాకినాడ), మే 3(ఆంధ్రజ్యోతి): సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తన వంతుసేవ చేస్తున్న కాకినాడకు చెంది న ప్రముఖ సాహితీవేత్త మార్ని జానకిరామ చౌదరి ఎన్టీఆర్ కీర్తి పురస్కారం లభించింది. విజయవాడ హోటల్ ఐలాపురం ఆడిటోరియంలో శనివారం పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సాంస్కృతిక సేవాతత్పరులను ఎంపికచేసి పురస్కారాలు అందజేశారు. కాకినాడకు చెందిన మార్ని జానకిరామచౌదరికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ నుంచి ఎన్టీఆర్ కీర్తి పురస్కారాన్ని అందజేశారు. సాహిత్య, సాంస్కృతిక కళారంగాల అభ్యున్నతికి కృషి చేస్తున్న జానకిరామచౌదరి నిబద్ధతను, సేవలను మండలి బుద్ధప్రసాద్ కొనియాడి, ఎన్టీఆర్ విగ్రహం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకి పలువురు అభినందనలు తెలిపారు.

ఆరో రోజు సీహెచ్‌వోల నిరవధిక సమ్మె


కాకినాడ కలెక్టరేట్ ఎదుట నిరసన చేస్తున్న సీహెచ్‌వోలు

కలెక్టరేట్(కాకినాడ), మే 3 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (విలేజ్ హెల్త్ క్లినిక్) పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్‌వో) ఆరో రోజు శనివారం నిరవ ధిక సమ్మె కొనసాగించారు. కాకినాడ కలెక్టరేట్ ఎదుట వీరు నిరసన తెలిపారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసన కొనసాగించారు. కార్యక్రమంలో ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవిడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ తమ డిమాండ్లను నెరవేర్చే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శ కాల ప్రకారం ఆరేళ్ల సర్వీసు ఉన్నవారిని క్రమబద్ధీకరించాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని కోరుతున్నామన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు హేమంత్, రఘు, వరకాంత్, నానాజీ పాల్గొన్నారు.

గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

గొల్లప్రోలు, మే 3 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంవద్ద ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. జిల్లాలో రైసుమిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులు నుంచి ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని సంఘాల నాయకులు తెలిపారు. రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోకపోవడంతో దళారులకే పంటను విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తక్షణం రైతుల సమస్యలపై దృష్టి సారించి వారు పండించిన పంటలకు మంచి ధర లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో ఆయా సంఘాల అధ్యక్షుడు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, డి.నారాయణమూర్తి, డొక్కులూరి సంగీత, రెడ్డి దుర్గాదేవి, బి.ఏసు, గుడాల చార్లెస్, బళ్ల సోమరాజు, వేగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డులో పిఠాపురం విద్యార్థులు


విద్యార్థులు, యోగా గురువును అభినందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): యోగాలో ప్రపంచ రికార్డుసాధనలో భాగస్వాములైన పిఠాపురం విద్యార్థులు, యోగా గురువును ఎమ్మెల్యే కె.నాగబాబు అభినందించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 21,800మందితో 108 సూర్యనమస్కారాలను 108 నిమిషాల్లో పూర్తిచేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఇందులో పిఠాపురం పట్టణానికి చెందిన యోగాగురువు వనం సత్యప్రియ ఆధ్వర్యంలో పది మంది విద్యార్థులు పాలుపంచుకున్నారు. వీరికి ప్రపంచ రికార్డులో భాగస్వాములైనందుకుగానూ ఇచ్చిన సర్టిఫికెట్లు, మెడల్స్‌ను నాగబాబు విద్యార్థులకు అందజేశారు. పలు జాతీయ, రాష్ట్ర పోటీల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచేందుకు కృషిచేస్తున్న యోగాగురువు సత్యప్రియను అభినందించారు.

గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు

పిఠాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, వాటి పరిరక్షణ కోసం గ్రామస్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. పిఠాపురంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని సచివాలయాల గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. సర్పంచ్ అధ్యక్షతన బాల్య వివాహాల నిరోధక కమిటీ, పర్యవేక్షణా కమిటీలను ఏర్పా టు చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు జరిపినా, ప్రోత్సహించినా, అందులో భాగస్వాములు అయినా చట్టపరంగా చర్యలు తప్పవని, రుజువైతే జైలు శిక్షలు విధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జీఎంఎస్‌కేలు పాల్గొన్నారు

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన

సామర్లకోట, మే 3 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ పరిధిలో మఠం సెంటర్ వద్ద మురుగుకాలువపై ఇటీవల తొలగించిన స్లాబ్ రాళ్ల తిరిగి పునర్నిర్మాణ పనులు చేస్తుం డడంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం ఆకస్మికంగా పరిశీ లించారు. ఇప్పటికే స్లాబ్‌రాళ్లు తొలగించి నెలలు కావస్తున్నా త్వరితగతిన కాలువ నిర్మాణం పూర్తిచేయక పోవడంతో తదుపరి చర్యల నిమిత్తం కమిషనర్ శ్రీవిద్య నిర్ణయం తీసు కోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణపు పనులు పూర్తిచేయాలని ఎమ్మెల్యే చినరా జప్ప కోరారు. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిఠాపురంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వెన్నపు చక్రధరరావు

పిఠాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులను పురపరిపాలనశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ వెన్నపు చక్రధరరావు శనివారం ప్రారంభించారు. 25 సంవత్సరాలుగా ఏటా ఈ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, రైటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో పిఠాపురం ఎంఈవోలు శ్యాంబాబు, నారాయణదాసు, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, సహృదయ మిత్రమండలి ప్రధాన కార్యదర్శి చిన్నారి సతీష్, ఉపాధ్యక్షుడు పోతుల శ్రీనివాస్, గుడాల రామకృష్ణ, వి.సత్యనారాయణరెడ్డి, కేవీవీ సత్యనారాయణ, పోలుపర్తి వేణు, వై.కరుణకుమార్, కామరాజు, గండేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం సత్యదేవుడి కల్యాణోత్సవాలపై ప్రచారం

కిర్లంపూడి, మే 3(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలపై శనివారం కిర్లంపూడి మండలంలో ప్రచారం నిర్వహించారు. జగపతినగరం, చిల్లంగి, గెద్దనాపల్లి, వేలంక గ్రామాల్లో సత్య దీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈనెల7 నుంచి 13వరకు అన్నవరంలో జరిగే ఉత్సవాలకు హాజరవ్వాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మందేస్తాం.. చిందేస్తాం

- ఆకతాయిల అడ్డాగా గ్రామ శివారు ప్రాంతాలు
- రహదారులపై మద్యం సీసాలు పగులగొడుతున్న మందుబాబులు
- పట్టించుకోని అధికారులు



ఎటపాక, మే 3(ఆంధ్రజ్యోతి): అల్లూరిజిల్లా ఎటపాక మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మందుబాబులు, జూదగాళ్లు బహిరంగంగా మద్యం సేవిస్తూ స్థానికులతోపాటు ప్రయాణికులకు అసౌకర్యం కల్పిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఎట పాక, పురుషోత్తపట్నం, గొళ్లగట్టతోపాటు గౌరిదేవిపేట, నెల్లిపాక, తదితర గ్రామ శివారు ప్రాంతాలతోపాటు విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారి వెంబడి సిట్టింగ్‌లు ఏర్పరుచుకుని, నిత్యం మందుబాబులు మద్యం సేవి స్తున్నారు. పొరుగున ఉన్న భద్రాచలం పట్టణానికి చెందిన అనేక మంది మందుబాబులు, జూదగాళ్లకు సరిహద్దు ప్రాంతాలైన ఎటపాక, గొళ్లగట్టు, బొజ్జిగుప్ప, పురుషోత్తపట్నం గ్రామాలు అడ్డాగా మారుతున్నాయి. గతంలో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై రాత్రివేళల్లో ఒంటరిగా ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుని, వారిని బెదిరించి వారి వద్ద నుంచి నగదు, సెల్‌ఫోన్లు బలవంతంగా లాక్కున్న ఘటనలు లేకపోలేదు. గౌరీదేవిపేట, గన్నవరం మధ్యలో చెరువుకట్ట రహదారిపై మందుబాబులు రాత్రి సమయాల్లో మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు రహదారులపై గడుపుతున్నారు. మద్యంమత్తులో మద్యం సీసాలను రహదారులపై పగులగొడుతున్నారు. దాంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురువుతున్నారు. కొందరు యువత అనేక వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను వదిలేస్తున్నారు. ఇకనైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గౌరీదేవిపేట రహదారిపై మద్యం సీసాలు పగులగొట్టిన దృశ్యం

సప్లిమెంటరీ పరీక్షలకు

సిద్ధమవుతున్న టెన్త్ విద్యార్థులు



విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయుడు

మోతుగూడెం, మే 3(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం టెన్త్ క్లాస్ ఫెయిల్ అయిన విద్యార్థులకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. ఈ సూచనల మేరకు మోతుగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో గతనెల 28 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనెల 19 నుంచి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో స్పెషల్ క్లాసులు నిర్వహించాలని విద్యాశాఖ సూచించింది. ఈమేరకు పరిషత్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు శాంసన్, పీసం శనేశ్వరరావు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

కూనవరం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. ఆలయం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు నందికొండ వెంకన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

నేటి నుంచి టీడీపీ గ్రామ సభలు

దేవీపట్నం, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామ పంచాయతీల గ్రామ కమిటీలు ఎన్నుకుంటారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 4న శరభవరం, దేవారం, 5న పాముగండి, డీఎన్‌పాలెం, 6న సీహెచ్‌ఆర్ పేట, తున్నూరు, 7న వి.రామన్నపాలెం, చొప్పకొండ, 8న ఇందుకూరు, దేవీపట్నం, 9న ఇందుకూరుపేట, కొండమొదలు, 10న పూడిపల్లి, మంటూరు గ్రామ కమిటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు.

పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం 15వేల మందికిపైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,19,442 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అకాల వర్షాలతో ధాన్యం రైతుల విలవిల

జగ్గంపేట రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండా కాలంలో అకాల వర్షాలతో ధాన్యం రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. చేతికొచ్చిన పంట వర్షానికి తడిసిపోవడంతో దిక్కుతోచని స్థితిలో విలవిలలాడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండిస్తే అమ్ముకునే దశలో ఈవర్షాల వల్ల ధాన్యం తడిసిపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక దిక్కుతోచని పరిస్థితులో ఉన్నామని వాపోతున్నారు. నాలుగు రోజుల నుంచి కోత కోసి కళ్లాలపై ధాన్యాన్ని రాశులుగా పోసి ఆరబెడుతున్నామని, మరో రెండు రోజులు ఆరబెడితే సరిపోయేదని, ఈలోపు వర్షం కురవడంతో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎండ పాలైనా తీయకుండా అలా మాగుడుగా ఉండిపోవడంతో మొలకలు ఎత్తుతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మా బాధను అర్థం చేసుకుని తడిసిన ధాన్యాన్ని పరిశీలించి దారి చూపించాలని వేడుకుంటున్నారు. పాలకులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుని ధాన్యం రైతులు ఆదుకోవాలని కోరుతున్నారు.



కాత్రావులపల్లిలో తడిసిన ధాన్యాన్ని నేరుపుతున్న రైతులు

ఏం చేయాలో అర్థం కావడంలేదు
గడుగువెంకన్న బాబు, రైతు



మూడు ఎకరాల వరి పొలం వేస్తామని, రెండు రోజుల క్రితం కోసం కళ్లాలపై ధాన్యాన్ని రాశులుగా పోసి ఆర బెడుతున్నాయిని ఈలోపే అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిందని, ఏంచేయాలో అర్థం కావడం లేదని వాపోతున్నాడు.

ఆందోళనగా ఉంది
గడుగుల లచ్చన్న, రైతు



ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాల వల్ల పూర్తిగా తడిసిపోయిందని ఏమవుతుందో అర్థం కాని పరిస్థితులో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎండ పాలు కూడా తీయలేదని, మొలకలు వచ్చేస్తాయోమోని ఆందోళనగా ఉందని అన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



కోటనందూరులో భారీ వర్షం దృశ్యం

కోటనందూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. కోటనందూరు, కాకరాపల్లి, జగన్నాధపురం, కెఎమల్లవరం, ఎల్‌డిపేట, అల్లిపూడి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ఈవర్షం పశువులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం



ప్రత్తిపాడులో వర్షానికి ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సెంటర్ జలమైన దృశ్యం

ప్రత్తిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం భారీ వర్షం కురిసింది. పగటిపూట ఎండ, సాయంత్రం వర్షం కురవడంతో ఐదు రోజులుగా పరిపాటిగా మారింది. ఒక వైపు ఎండలు దంచి కొట్టడం, మరోవైపు సాయంత్రం వర్షం కురవడంతో ఎండ తీవ్రత నుంచి వృద్ధులు, పిల్లలు ఉపశమనం పొందుతున్నారు.

పత్రికా స్వేచ్ఛా దినోత్సవం

జగ్గంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు), టీడీపీ జగ్గంపేట, గండేపల్లి మండలాల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు పాల్గొన్నారు. టీడీపీ మీడియా, సోషల్ మీడియాకి సేవలు అందిస్తున్న పాత్రికేయులు మండపాక అప్పన్న దొరను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, గండేపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్ బొల్లం రెడ్డి రామకృష్ణ, మల్లిశాల సర్పంచ్ సర్వసిద్ధి నూక రత్నం లక్ష్మణరావు, రాష్ట్రమైనార్టీ సెల్ కార్యదర్శి ఎండీ కాజా, తెలుగు యువత జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కొంజేతు శ్రీను పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన తుమ్మలపల్లి



జగ్గంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిఠాపురం నియోజకవర్గ విచ్చేసిన సందర్భంగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ వెళ్లి కలిసి స్వాగతం పలికారు. తుమ్మలపల్లి చందు, సాయి, రాము, కాయల మణికంఠ, పాలెం బాబి, గుంటముక్కల చిన్న ఇతరులు ఉన్నారు.

వేసవి శిబిరాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

గండేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): గండేపల్లి ఎంపీడీవో ఆఫీసులో కిశోరి వికాసం వేసవి శిబిరాలపై శనివారం సీడీపీ ఎం.పూర్ణిమ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు. పిల్లల సంరక్షణ, అక్రమ రవాణా, ఆత్మ రక్షణ, సైబర్ నేరాలను వివరించారు. సూపర్‌వైజర్లు నాగ పార్వతి, ఎంపీడీవో సీనియర్ అసిస్టెంట్, మహిళ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంతి ఉద్యోగులకు సేవలందించడమే లక్ష్యం



నూతనంగా ఎంపికైన విశ్రాంతి ఉద్యోగుల కార్యవర్గం

ఏలేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగుల సంఘ మండల అధ్యక్షుడిగా చాగంటి నరసింగరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ నేతృత్వంలో నూతన యూనిట్‌ను ప్రారంభించారు. అధ్యక్షుడిగా నరసింగరావు, సభ్యుడిగా కొందిని రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి ఎంపిక చేశారు. విశ్రాంతి ఉద్యోగులకు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మామిడి రాము, అత్తిలి శ్రీనివాస్, వడ్డి ప్రభుదాస్, సుబ్రమణ్యం, కోకా రాజేశ్వరిలు నరసింగరావుకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

ప్రత్తిపాడులో వేగులమ్మ జాతర ప్రారంభం



ప్రత్తిపాడులో బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

ప్రత్తిపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో వేగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం రాత్రి కోలాహలంగా ప్రారంభమయ్యాయి. వందలాదిమంది భక్తులతో జాగారం నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, వేషాలు, తప్పిడిగుళ్లు, తదితర కళా ప్రదర్శనల మధ్య జాగారం కొనసాగింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ప్రత్తిపాడు, కిర్లంపూడి ఎస్‌ఐలు ఎస్.లక్ష్మీకాంతం, వి.సతీష్ బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని పోలీసులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వెలుగుల నాని, జనసేన నాయకుడు గోపిశెట్టి శ్రీను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'ఆదిత్య'లో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ డే



స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ డే దృశ్యం

గండేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్.ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా కాట్మండు యూనివర్సిటీ నేపాల్, అసోసియేట్ ప్రొఫెసర్.యు.ప్రసాద్ ప్యాకురెల్, గౌరవ అతిథిగా జింబాబ్వే ఎంబసీ భారతదేశ ప్రతినిధి ఫినియాస్ మాన్యాంగ విచ్చేశారు. కళాశాలలో 2024-2025 విద్యాసంవత్సరంలో బీటెక్. బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఫార్మా-డీ, బీఎస్సీ ఫోరెన్సిక్, బీబీఏ, ఎంబీఏ విభాగాల్లో చదువు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఇంటర్నేషనల్ అడ్మిషన్స్ డీన్ వరంజిత్ సింగ్, వైస్‌ఛాన్సలర్ ప్రొ.ఎం.బి.శ్రీనివాస్, ప్రొవైస్ ఛాన్సలర్ డాక్టర్ ఏ.రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.రవిశంకర్, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరంలో డ్రైన్లు అధ్వానం





ధర్మవరంలో రామన్నపేటలో డ్రైన్ అధ్వానంగా ఉన్న దృశ్యం, ధర్మవరం నంది సెంటర్ నుంచి వెంకట్రావు చెరువుకు వెళ్లే కాలువలో వర్షం నీరు నిలిచిపోయిన దృశ్యం

ప్రత్తిపాడు, మే3(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలోని అనేక వీధుల్లో డ్రైన్లు దెబ్బతిని చెత్తాచెదారాలతో నిండిపోయాయి. ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచిపోయి దుర్గంధభరిత వాతావరణం ఏర్పడింది. వర్షం కురిసే సమయంలో డ్రైన్లలో చెత్తాచెదారాలు ఉండటంతో వర్షం నీరు ప్రవాహం నిలిచిపోతుంది. వర్షం నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ల అభివృద్ధిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఊటా వీరబాబు, గ్రామస్తులు కోరుతున్నారు.

కోట్ల రూపాయలు వెచ్చించారు

నడిచే దారి కూడా లేకుండా చేశారు



జగనన్న కాలనీలో రోడ్ల దుస్థితి



జగ్గంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో జగనన్న కాలనీపేరిట 75 ఎకరాల భూసేకరణ చేసి ఇళ్ల స్థలాల ఏర్పాటు చేశారు. అయితే ఈప్రాంతానికి రహదారి మార్గాలను పూర్తిగా ఏర్పాటు చేయకపోవడంతో ఈకాలనీలో గృహాలు ఏర్పాటు చేసుకున్న వారు రోజూ రాకపోకలు సాగించడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో కూడా రహదారిపై నీరు చేరుతుంది. దీనిని బట్టి చూస్తే అర్థమవుతోంది కాలనీ రహదారులు ఎలా ఉన్నాయో అని. కనీసం వర్షా కాలానికైనా ప్రధాన రహదారులు వేయాలని జగనన్నకాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ఏలేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం రైతు సాధికార సంస్థ నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, ప్రజాప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రత్తిపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): యర్రవరం ఏలేరు కాలువలో స్నానానికి దిగి ప్రత్తిపాడుకు చెందిన అమ్మమ్మ అరట్లకట్ట సత్యవతి, మనవడు గోర్స వీర మనోజ్ మృతిచెందగా బాధిత కుటుంబానికి ప్రత్తిపాడు వ్యాపారులు, వైద్యులు, గ్రామపెద్దలు రూ.25వేలు ఆర్థిక సహాయం అందించారు. స్థానిక ఏగులమ్మ గుడి సమీపంలో నివాసం ఉంటున్న బాధిత కుటుంబీకులకు శనివారం ఈ నగదు మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఏవీ రమణ, పవన్‌కుమార్, సిద్ధికొండ, ప్రత్తిపాడు వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీను రాపూరి తాతాజీ, కొప్పాల చిట్టిబాబు, రాపర్తి రామలింగేశ్వరరావు, చిత్రా అప్పారావు, దర్నాలకోట శ్రీను పాల్గొన్నారు. అలాగే జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం కూడా బాధిత కుటుంబానికి రూ.11వేలు సహాయం అందించారు.

విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు

ఏలేశ్వరం, మే 3(ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలునిర్వహించారు. ఉపాధ్యాయుడు త్రిమూర్తులు కథలు, పాటలు, పద్యాలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

కిర్లంపూడిలో వేసవి శిబిరం ప్రారంభం

కిర్లంపూడి, మే 3(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలంలోని సత్యదేవ కల్యాణ మండపంలో కిశోరి వికాసం వేసవి శిబిరాన్ని శనివారం సీడీపీవో పూర్ణిమ అధ్యక్షతన ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఐ సతీష్ మాట్లాడారు. పిల్లల సంరక్షణ, అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం వంటి అంశాలను వివరించారు. ఎంఈవో జోసఫ్ మాట్లాడుతూ ఈశిబిరాల ద్వారా నేర్చుకున్న అంశాలను గుర్తు చేసుకుంటూ ముందడుగు వెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వేదుకుమారి, డిప్యూటీ ఎంపీడీవో, సూపర్‌వైజర్లు సునీత, బుసమ్మా కరిమున్నిసా తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి



విద్యార్థులను అభినందిస్తున్న తుని మున్సిపల్ చైర్‌పర్సన్

తుని రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. పట్టణంలో మున్సిపల్ పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె శనివారం అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నార్ల రత్నాజీ, బోడపాటి అప్పారావు తదితరులు ఉన్నారు.

ఎస్.అన్నవరంలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తునిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): ఎస్.అన్నవరం గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. హైమా నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ వైద్యులు వైద్య పరీక్షలతో పాటు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు.